క్లుప్తంగా

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



మైలవరం: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూల మాలలు వేసి సోమవారం ఘంగాన నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మైలవరం అధ్యక్షుడు బయ్యన శ్రీనివాస రావు, నాయకులు మహేష్ ప్రసాద్, కన్నయ్య, కృష్ణమూర్తి, దూపగుండ్ల ప్రసాద్, వార్డు సభ్యులు ఉమామహేశ్వరరావు, జూలూరు శాస్త్రి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చంద్రుపట్ల (విస్సన్నపేట): ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఎంపీడీఓ ఎస్ వెంకట రమణ అన్నారు. మండలంలోని చంద్రుపట్ల సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. సర్పంచ్ బాలకొండయ్య, బీజేపీ నాయకులు బాబు, కొండలరావు, యలమందరావు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



విస్సన్నపేట: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న కోదండ సీతారామాంజనేయ దేవస్థానంలో రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు సోమవారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వితరణ



తిరువూరు: మండలంలోని కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జే మురళీకృష్ణ తిరువూరుపట్టణంలో అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు సోమవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అమ్మప్రేమాశ్రమం, సద్గురు సాయి దివ్యాంగుల ఆశ్రమాల్లో ఈ వితరణ ఇచ్చినట్టు మురళీకృష్ణ తెలియజేశారు. ఆశ్రమాల నిర్వాహకులు రవిచంద్ర, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కాశీ, బాజీ పాల్గొన్నారు.

దివ్యాంగులు కూడా రాణిస్తారు



నూజివీడు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని భవిత సెంటర్‌లో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. పీఆర్ డే ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణకుమారి మాట్లాడుతూ దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను అందజేశారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు కే కిరణ్ ప్రసూన, ఎం.జ్యోతి, ఫిజియోథెరపిస్ట్ జీ ప్రశాంతి, సీజీవీ టీ ఇందిరా ప్రియదర్శిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

తిరువూరు: మండలంలోని లక్ష్మీపురంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. తిరువూరు ఎస్సై సతీష్ కథనం మేరకు లక్ష్మీపురం శివారు రాయగూడెంకు చెందిన దైదా నాగేశ్వరరావు(32) దుర్వ్యసనాలకు బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. భార్యా పిల్లలు దూరమవడంతో మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు ఆదివారం ఉదయం పురుగులమందు తాగాడు. గ్రామస్తులు అతడ్ని తిరువూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం



విస్సన్నపేట మండలంలో వరికుప్పలను పరిశీలిస్తున్న ఏడీఏ శశికళ



చాట్రాయి మండలంలోని నరసింహారావుపాలెంలో కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఆగిరిపల్లి మండలంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి చెన్నారావు

తిరువూరు: తుపాను కారణంగా ఈదురుగాలులతో కూడిన భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తిరువూరు మండల అధికారులు అప్రమత్తమయ్యారు. ఖరీఫ్ వరి కోతలు జరగని రైతులను గుర్తించి రైతు భరోసా కేంద్ర సిబ్బంది వెంటనే వారి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు ఆదేశించారు. ఈదురుగాలులకు, భారీవర్షాలకు పొలాల్లో విద్యుత్‌స్తంభాలు ఒరిగినా, తీగలు తెగినా వెంటనే తమకు తెలియజేయాలని విద్యుత్ అధికారులు రైతులను కోరారు. రైతులు తమ పొలాల్లో కోసిన ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా పట్టాలు కప్పాలని, సాధ్యమైనంత త్వరగా ఆర్బీకేలలో విక్రయించాలని వ్యవసాయాధికారి పద్మ సూచించారు. ప్రభుత్వాదేశాల మేరకు తిరువూరు మండలంలోని అన్ని పాఠశాలలకు సోమ, మంగళవారం సెలవు ప్రకటించారు.

సురక్షిత ప్రాంతానికి తరలించాలి

విస్సన్నపేట: తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయి కాబట్టి కల్లాలోని ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి లేదా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలని డివిజన్ ఏడీఏ శశికళ అన్నారు. మండలంలోని నరసాపురం, పుట్రేల గ్రామాల్లో వరిపంట పొలాలను, కుప్పలను ఏడీఏ సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేసారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా పట్టాలు కప్పాలి

చాట్రాయి: మిచాంగ్ తుపాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విశ్వనాథరావు రైతులకు సూచించారు. మండలంలోని నరసింహారావు పాలెం, చాట్రాయి, జనార్ధనవరం గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా చుట్టూ నీరు నిల్వకుండా పట్టాలతో కప్పుకోవాలని ఆయన చెప్పారు. ఆరబెట్టిన ధాన్యాన్ని కల్లాల్లో ఉంచకుండా ఆర్బీకేల ద్వారా రైస్ మిల్లులకు తరలించాల్సిందిగా ఆయన సూచించారు. పచ్చి ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. తుపాను వలన అత్యవసరంగా సోమవారం 140 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు లారీల ద్వారా తరలించామని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని ఎలాంటి ధాన్యాన్ని అయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.శివ శంకర్ పాల్గొన్నారు.

భారీ వర్షాలు కురిసే అవకాశం

ఆగిరిపల్లి: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి విద్యుత్ ఏఈ రామారావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొలాల్లో కరెంటు స్తంభాలు, విద్యుత్ మీటర్లు దగ్గర రైతులు జాగ్రత్తగా ఉండాలని, అలాగే గృహ అవసరాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్తు ఉపకరణాలు వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్వీస్ వైర్లను గాని, వాటితో వేలాడే ఇనుప తీగలను గానీ తాకకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ఆగిరిపల్లి: రైతులు ఆందోళన చెందవద్దని వీలైనంత వేగంగా ఆఫ్ లైన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు మంగళవారం వరకు మిల్లులకు తరలించుకునేందుకు సివిల్ సప్లై వారు అవకాశం కల్పించారని మండల వ్యవసాయాధికారి చెన్నారావు తెలిపారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం రాశులను, వరిపొలాలను ఏఓ చెన్నారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వరి కోసి పనల మీద ఉన్నట్లయితే ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేసుకోవాలన్నారు. ధాన్యం రంగు మారకుండా ఉండేందుకు మ్యాంక్ జెబ్, కార్బండిజం రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి ఉంచుకోవాలని ఏఓ సూచించారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో అర్జీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో మూడు అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, ఏసీడీపీఓ నాగేశ్వరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

తుపానుతో రైతుల ఆందోళన



చనుబండ గ్రామంలో కల్లాల్లో ఉన్న ధాన్యానికి పట్టా కప్పుతున్న రైతు

చాట్రాయి: మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సోమవారం ఉదయం నుంచి జోరువానతో పాటు ఈదురుగాలులు వీస్తుండడంతో వరిపైరు నేలవాలింది. ఆరుబయట ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు పట్టాలతో కప్పుకుంటూ నీరు నిలవకుండా తగిన జాగ్రతలు తీసుకుంటున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా 50 శాతం కోతలు కోశారు. గత రెండు రోజుల నుంచి వరి కోతలు కోద్దామనుకుంటే వరి కోత మెషీన్లు, కొరత ఏర్పడడంతో చేతికి వచ్చిన పంట వరిపొలాల్లోనే ఉందని రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల జీవిత గాధలే ఆదర్శం కావాలి



ముసునూరులో దివ్యాంగ బాలలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, ఎంఈఓ

ముసునూరు: అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ వంటి వారి జీవిత గాధలు మనకు ఆదర్శం కావాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు పేర్కొన్నారు. ముసునూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం హన్నామణి అధ్యక్షతన దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమ, ఆప్యాయతలతో ఆదరించి, అక్కున చేర్చుకోవాలన్నారు. ఎందరో దివ్యాంగులు తమ అంగవైకల్యాన్ని అధిగమించి, చరిత్ర సృష్టించారని, వారి జీవిత గాధలను దివ్యాంగ బాలలందరికీ తెలియజేయాలన్నారు. వివిధ ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన దివ్యాంగ బాలలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కె.విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతి, ఐఈఆర్ టీచర్లు లక్ష్మీనారాయణ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎంఈఓ ఎల్.బాలు తెలిపారు. స్థానిక మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో స్థానిక భవిత సెంటర్‌లో దివ్యాం గుల దినోత్సవం సందర్భంగా దాతలు బీఎం పవన్‌కుమార్, ఎం లలితశ్రీ దంపతులు సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించి, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యురాలు మాధవి, నాగమణి, టీచర్ కనకదుర్గ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవాలి

నూజివీడు: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డు సచివాలయంలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలను తెలిపే బోర్డును వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, జగన్ పాలనకు తేడాను గమనించాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. అనంతరం వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ పిళ్లా చరణ్, సచివాలయ కన్వీనర్లు కోటగిరి పూర్ణిమ, కొండా వెంకట్రావు, భుజంగరావు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

పటమట(విజయవాడ తూర్పు): ఆస్పత్రి బయట ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులో మంటలు చెలరేగిన సంఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పటమట పోలీసుల కథనం మేరకు భారతీనగర్ నోవాటెల్ సమీపంలోని ఓ ఆస్పత్రి బయట ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులో సోమవారం షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే ఆస్పత్రి సిబ్బంది ఆటోనగర్ ఫైర్ స్టేషన్ సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్పత్రికి స్వల్ప ఆస్తి నష్టం సంభవించిందని, ఎలాంటి ప్రాణాపాయం కలగలేదని పటమట పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాంను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నూజివీడు: పట్టణంలోని శ్రీ సత్యసాయి బాల భారతి స్కూల్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు ఆధ్వర్యంలో సోమవారం యూనిఫాంను పంపిణీ చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని 100 మంది పిల్లలకు యూనిఫాం పంపిణీ చేయడంతో పాటు రూ.50 వేల విరాళాన్ని పాఠశాలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాల బాలికలందరూ చక్కగా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగి ఆ తర్వాత సమాజానికి సేవ చేయాలని అన్నారు. అనంతరం త్రివిధ పాఠశాలలో మొక్కలు నాటారు. అలాగే ఉచిత ఫ్రీజర్‌ను రోటరీ క్లబ్ నూజివీడుకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వై పార్థసారథి, డిస్ట్రిక్ట్ సెక్రటరీలు ఎం.భాస్కర్, శరత్, క్లబ్ అధ్యక్షుడు గొల్లపూడి రవిబాబు, కార్యదర్శి పీడీ వెంకటరత్నం, సభ్యులు బోయపాటి ముఖర్జీ, మూల్పూరి లక్ష్మణస్వామి, యార్లగడ్డ రాజగోపాల్, పైడి అనిల్, మలిశెట్టి శ్రీనివాస్, ఎం.రత్నాకర్, డి.నరేంద్ర కుమార్, మండా శ్రీను, సాయి భాస్కర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

మైలవరం: తుపాను హెచ్చరిక నేపథ్యంలో మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి సోమవా రం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభించినపుడు తెలియజేయనున్న ట్లు పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమ నించి, సహకరించాలని ఆయన కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తిరువూరు: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుసరీ్వసు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరులో ఈ బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం మీదుగా 25వ తేదీ రాత్రికి అరుణాచలం చేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి ఆలయాల దర్శనం అనంతరం 27వ తేదీ రాత్రి తిరువూరు చేరుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయం ఉందని తెలిపారు. వివరాలకు 98856 61835లో సంప్రదించాలని కోరారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు



ముసునూరు మండలం బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు



చాట్రాయిలో ప్రత్యేక పూజలు

ముసునూరు: కార్తిక మూడో సోమవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడగా, అంతటా శివనామ స్మరణలు మార్మోగాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి బలివేలోని బలే రామస్వామి ఆలయంలో త్రిలోచనుడికి జ్యోతిర్లింగాష్టక పారాయణంతో, అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు రాజరాజేశ్వరీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముసునూరు, పెదవేగి, ఏలూరు మండలాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ ఆకుల కొండలరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం తమ్మిలేరులో తాత్కాలిక వంతెనకు పడిన గండ్లు పూడ్చించి, ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. చెక్కపల్లిలోని శివాలయం, భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రమణక్కపేటలోని పార్వతీ సమేత శివాలయంలో భక్తులు శమీ వృక్షం చెంత దీపోత్సవం నిర్వహించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: కార్తిక మాసం సందర్భంగా మండంలోని ఆలయాల్లో సోమవారం పూజలు నిర్వహించారు. తుపాను ప్రభావంతో జల్లులు పడుతున్నప్పటికీ సి గుడిపాడు, చాట్రాయి శివాలయాలకు భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

పోలీస్ స్పందనలో 71 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా స్పందన కార్యక్రమంలో డీసీపీ విశాల్‌గున్నీ 71 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 16, కుటుంబ కలహాలపై 16, ఆస్తి వివాదాలపై 12, మోసాలకు సంబంధించి తొమ్మిది, ఇతర సమస్యలపై 18 ఫిర్యాదులను బాధితులు అందజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని అధికారులకు డీసీపీ ఆదేశాలిచ్చారు.

రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు అన్నారు. ఆ కళాశాల జువాలజీ, జాతీయ సేవా పథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రక్తదానం తోటి మానవుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించి తోటివారి ప్రాణాలను కాపాడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వరరావు, రమేష్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి, జువాలజీ, బోటనీ విభాగాల అధిపతులు సాహితీ, అలీబాషా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శేషగిరిరావు, డి.పవన్‌కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండండి



చిల్లకల్లు నదీ తీరంలో అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ అజిత



కొండ ప్రాంతాల్లో పర్యటిస్తున్న డీసీపీ సత్తిబాబు, ఏసీపీ హనుమంతరావు, సీఐ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కొండ ప్రాంతాల్లో ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డీసీపీ మోకా సత్తిబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు డీసీపీ మోకా సత్తిబాబు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా కొండ రాళ్లు జారి పడే ప్రమాదం ఉన్న ప్రాంతవాసులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలతో పాటు కొండ శివారు ప్రాంతాల్లో నివాసం ఉన్న వారి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చిట్టినగర్ సొరంగం, గొల్లపాలెంగట్టు, వించిపేట, నైజాంగేటు కొండ ప్రాంతాల్లోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైక్ ద్వారా ప్రచారం చేయించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయవాడస్పోర్ట్స్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను డీసీపీ వి.అజిత అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నదీ తీరాన ఉన్న నందిగామ, జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. మిచాంగ్ తుఫాన్ నెల్లూరు-మచిలీపట్నం ప్రాంతాల్లో తీరం దాటవచ్చని వాతావరణ శాఖ సూచిస్తున్నట్లు ప్రజలకు వివరించారు. తీరం దాటే సమయంలో వర్షం అత్యధికంగా కురిసే అవకాశాలున్నాయన్నారు. అధిక నీటి ప్రవాహం ఉండే రోడ్డులు, నదులు, వాగులతో పాటు బ్రిడ్జిలు దాటేందుకు ఎవరూ సాహించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. కృష్ణానది వైపు వెళ్లవద్దని కోరారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంబాలు, చెట్లు, బలహీనంగా ఉన్న ఇంటి గోడలు వద్ద ఉండొద్దని సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను బాధితుల సహాయార్థం పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. తుఫాన్ కారణంగా ఇబ్బందుల్లో ఉన్న వారు ఎవరైనా 0866-2491001ను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. నదీ తీరంలోని అన్ని మండలాల్లోనూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. డీసీపీ వెంట క్రైమ్ ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ జనార్దననాయుడు, సీఐలు జె.ఆర్.కె.హనీష్‌బాబు, ఎం.జానకీరామ్, ఐ.వి.నాగేంద్రకుమార్, అగ్నిమాపక సిబ్బంది, పలు శాఖల అధికారులు ఉన్నారు.

మధుర స్వరాల శాల ఘంటసాల

విజయవాడకల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని జీఆర్‌కే సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద సోమవారం ఘంటసాల 101 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సభలో నారాయణరావు మాట్లాడుతూ ఘంటసాల స్వరం భగవంతుడు తెలుగు వారికి ఇచ్చిన గొప్ప వరమని అన్నారు. శ్రీ కళా భారతి అధ్యక్షుడు శింగంశెట్టి పెద బ్రహ్మం మాట్లాడుతూ ఏటా ఘంటసాల పేరుతో పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు, పాత్రికేయుడు కొల్లూరి వెంకట్, సయ్యద్ ఆలీ, గాయకుడు మంగరాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఘంటసాల పాటలను ఆలపించారు. ప్రతినిధులు ఘంటసాల చిత్రపటానికి నివాళులు సమర్పించారు.

సంగీత కళాశాల ఆధ్వర్యంలో...

దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో ఘంటసాల జయంతి సందర్భంగా ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. సుధా శ్రీనివాస్, గుడిపాటి హరికృష్ణ తదితరులు ఘంటసాల పాటలను సుమధురంగా ఆలపించారు.